بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 27 February 2026 (Telugu)

# దైవ ఏకత్వ నేపథ్యంలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 27.02.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

ప్రవక్తలందరు ఈ లోకంలో తౌహీద్ (దైవ ఏకత్వం)ను స్థాపించడానికే అవతరించారు. వారు తమ జాతులకు దాని గురించే బోధించారు. హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడా ఇదే సందేశాన్ని తీసుకొచ్చారు, అదే పనిని కొనసాగించడానికి అవతరించారు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం షిర్క్ (బహుదైవారాధన)కు వ్యతిరేకంగా పోరాటం చేస్తే అది కేవలం ఆధారాలు లేకుండా చేసినది కాదు. వాస్తవానికి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం బహుదైవారాధన చెడును వివరించారు, దాని గురించి అవగాహన కల్పించి దాని పట్ల విరక్తిని కలిగించారు.

ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులపై అద్భుత ప్రభావం చూపిన ఈ బోధన ఎంతో శక్తివంతమైనది కావడానికి కారణం, ఆయన ప్రతి మాట, ప్రతి క్రియ ఆ బోధనకు నిజమైన ప్రతిరూపంగా ఉండటమే. ఇతర జాతులు తమ ప్రవక్తలను ఏ విధంగానైతే పూజా స్థలాలుగా మార్చుకున్నారో, ముస్లిం ఉమ్మత్‌లో కూడా అటువంటి భయంకరమైన పాపం పుట్టకూడదని ఆయన ఆందోళన చెందారు. పవిత్ర ఖుర్‌ఆన్‌లో పదేపదే వివిధ కోణాల్లో మనకు తౌహీద్ గురించి బోధించడం జరిగింది. అల్లాహ్ తఆలా అన్బియా అధ్యాయంలో ఈ విధంగా ఉపదేశించాడు:

وَمَآ أَرْسَلْنَا مِنْ قَبْلِكَ مِنْ رَّسُوْلٍ إِلَّا نُوْحِيْٓ إِلَيْهِ أَنَّهٗ لَآ إِلٰهَ إِلَّآ أَنَا فَاعْبُدُوْنِ

అనగా మేము నీకు పూర్వము పంపిన ప్రవక్తలందరికి ఈ విధముగా సువార్తవాణి పంపుచుంటిమి. వాస్తవముగా నేను ఒకడినినే అల్లాహ్‌ను కనుక (కేవలము) నన్నే ఆరాధింపుము. పవిత్ర ఖుర్‌ఆన్ ముగింపులో అల్లాహ్ తన తౌహీద్‌ను ఈ విధంగా ప్రకటిస్తున్నాడు.

قُلْ هُوَ اللّٰهُ أَحَدٌ۔ اللّٰهُ الصَّمَدُ۔ لَمْ يَلِدْ وَلَمْ يُوْلَدْ۔ وَلَمْ يَكُنْ لَّهٗ كُفُوًا أَحَدٌ

అనగా నీవు (ఇతర మానవులతో) ఇట్లనుచుండుము విషయమేమనగా అల్లాహ్ వంటరివాడు. అందరి అవసరాలను తీర్చు వాడే అల్లాహ్ (అతనికెవరి సహాయం అవసరం లేదు). అతనికి సంతానం లేదు, అతడు ఎవని చేత పుట్టింపబడలేదు. అతనితో సమానుడు ఎవ్వడు లేడు.

అల్లాహ్ తఆలా ఇక్కడ ప్రతి రకమైన బహుదైవారాధనను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించాడు. హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వభావం ఎంతటి పవిత్రమైనదంటే, తౌహీద్ పట్ల ప్రేమ ఆయన నరనరాల్లోనూ నిక్షిప్తమై ఉంది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రలోని కొన్ని సంఘటనలను నేను మీ ముందు ఉంచుతున్నాను. హజ్రత్ ఉమ్మె ఐమన్ రజియల్లాహు అన్హా ఈ విధంగా ఉల్లేఖించారు. బవానా అనే పేరు గల ఒక విగ్రహం ఉండేది. ఖురైషీలు దానినెంతో గౌరవించే వారు. వారు దాని దగ్గరకు హాజరయ్యేవారు. అబూ తాలిబ్ కూడా తన జాతి ప్రజలతో కలిసి అక్కడికి వెళ్లేవారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను కూడా తనతో పాటు తీసుకువెళ్లాలని కోరుకునేవారు, కానీ మహా ప్రవక్త గారు నిరాకరించేవారు. ఒకసారి తన మేనత్తల తీవ్ర ఒత్తిడి మేరకు ఆయన అక్కడికి వెళ్లారు, కానీ ఎంతో భయపడి తిరిగి వచ్చేసారు. ఆయన ఇలా అన్నారు. నేను అక్కడ ఒక వింత దృశ్యాన్ని చూశాను. నేను ఆ విగ్రహం దగ్గరకు వెళ్లబోతుండగా తెల్లని దుస్తులు ధరించిన ఒక వ్యక్తి గట్టిగా అరుస్తూ ఇలా అన్నాడు. ఓ ముహమ్మద్! వెనకకు ఉండు, ఈ విగ్రహాన్ని తాకవద్దు.

పవిత్ర ఖుర్‌ఆన్ అవతరణకు ముందు ఏకైక దేవుణ్ణి ఆరాధించడానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హిరా గుహకు వెళ్లేవారు. ఇది మక్కా నుండి సుమారు మూడు మైళ్ల దూరంలో ఉంది. ప్రస్తుతం దీనిని జబలె నూర్ అని పిలుస్తారు. మహా ప్రవక్త గారికి నలభై ఏళ్ల వయస్సు వచ్చినప్పుడు ఒకరోజు జిబ్రయీల్ అలైహిస్సలాం ప్రత్యక్షమయ్యారు. అప్పుడు మహా ప్రవక్త సల్లంపై మొట్టమొదటి దైవవాణి అవతరించింది. మొదటి దైవవాణి రావడంతోనే, పవిత్ర ప్రవక్త సల్లం ప్రజలను అల్లాహ్ తౌహీద్ వైపు పిలవడం ప్రారంభించారు. అన్యారాధనకు వ్యతిరేకంగా బోధించడం మొదలుపెట్టారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించారు. సత్యాన్ని చాటిచెప్పడంలో మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక మహోన్నత సంస్కర్త. ఆయన అంతరించిపోయిన సత్యాన్ని తిరిగి ఈ లోకానికి తీసుకువచ్చారు. ఈ విషయంలో మన ప్రవక్తతో మరే ఇతర ప్రవక్త సాటిరారు. ఎందుకంటే, ఆయన ఈ ప్రపంచాన్ని ఘోరమైన చీకటిలో ఉన్నప్పుడు చూశారు, ఆపై ఆయన రాకతో ఆ చీకటి కాంతిగా మారిపోయింది. ఆయన ఏ జాతిలోనైతే జన్మించారో, ఆ జాతి ప్రజలందరూ బహుదైవారాధన అనే వస్త్రాన్ని విడిచిపెట్టి, ఏకేశ్వరోపాసన అనే వస్త్రాన్ని ధరించే వరకు ఆయన మరణించలేదు. అంతే కాకుండా, ఆ ప్రజలు విశ్వాసంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. వారిలో కనిపించిన సత్య సంధత, విశ్వసనీయత, దృఢ నిశ్చయం వంటి గుణాలకు ప్రపంచంలో ఎక్కడా సాటి లేదు. ఇటువంటి అఖండ విజయం హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తప్ప మరే ప్రవక్తకు లభించలేదు. ప్రపంచం అత్యంత అంధకారంలో ఉన్న సమయంలో ఆయన ప్రవక్తగా పంపబడటమే ఆయన ప్రవక్తుత్వానికి ఒక గొప్ప నిదర్శనం. లక్షలాది మంది ప్రజలు విగ్రహారాధనను వదిలిపెట్టి, తౌహీద్, సన్మార్గాన్ని స్వీకరించిన తర్వాతే ఆయన ఈ లోకం నుండి నిష్క్రమించారు. నిస్సందేహంగా ఆధ్యాత్మికతను స్థాపించడంలో మన ప్రవక్త రెండవ ఆదమ్. నిజానికి ఆయనే అసలైన ఆదమ్, ఎందుకంటే ఆయన ద్వారానే మానవీయ విలువలన్నీ పరిపూర్ణతకు చేరుకున్నాయి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. విచారం! దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మనకు బోధించిన తౌహీద్ గొప్పతనాన్ని నేడు ముస్లిం సమాజం మరచిపోతోంది. ఈ స్వచ్ఛమైన తౌహీద్‌ను విస్మరించడం వల్ల అల్లాహ్ తఆలా గుణగణాలపై ఉండాల్సిన ఆ నిఖార్సైన విశ్వాసం ఒక ముస్లింకు ఉండాల్సిన విధంగా లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మహా ప్రవక్త గారి నిజమైన దాసుడైన హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంను విశ్వసించే వారి బాధ్యత ఏమనగా తౌహీద్‌ను సరిగ్గా అర్థం చేసుకోవడం, తమలో ప్రత్యేకమైన మార్పులను తెచ్చుకోవడం.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇది ఆరాధనలకు సంబందించిన ప్రత్యేక మాసం. రమజాన్ నెలలో

దీని (తౌహీద్ స్థాపన) కోసం ప్రత్యేకంగా కృషి చేయవలెను, దుఆ చేయవలెను, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన జీవితాంతం తౌహీద్ స్థాపన కోసం ఏ విధంగానైతే శ్రమించారో మనకు కూడా వారిపై ప్రేమ ఉందని చెప్పుకుంటే మనం కూడా దాని కోసం ప్రత్యేకంగా కృషి చేయాల్సి ఉంటుంది.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఈ విధంగా ఉపదేశించారు. పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ తఆలా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇలా అంటున్నాడు. ఓ ముహమ్మద్! నీవు ప్రపంచంలోని ప్రతి మూలలో ఉన్న ప్రజలను హెచ్చరించు, కానీ మొదట నీ బంధువులను హెచ్చరించు, ఎందుకంటే నీపై వారికి రెట్టింపు హక్కు ఉంది. అల్లాహ్ ఆజ్ఞను పాటిస్తూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా ఆచారం ప్రకారం సఫా పర్వతంపై నిలబడి, వివిధ తెగల పేర్లను పిలవడం ప్రారంభించారు. మక్కా ప్రజలందరూ అక్కడ సమావేశమైనప్పుడు ప్రవక్త గారు వారితో ఇట్లన్నారు: చూడండి! ఒకవేళ నేను మీతో ఈ పర్వతం వెనుక ఒక పెద్ద సైన్యం దాగి ఉంది, అది మీపై దాడి చేయబోతోందని చెబితే, మీరు నా మాట నమ్ముతారా? అందుకు వారు తప్పకుండా నమ్ముతాము, ఎందుకంటే మేము నిన్ను ఎప్పుడూ సత్యవంతుడిగానే చూశామని బదులిచ్చారు. అప్పుడు ప్రవక్త గారిఇలా ప్రకటించారు:

ఓ ప్రజలారా వినండి! నేను మీకు ఒక ముఖ్యమైన వార్తను అందిస్తున్నాను. అల్లాహ్ నన్ను తన ప్రవక్తగా పంపాడు. మీరు అల్లాహ్ శిక్ష నుండి రక్షించబడాలని కోరుకుంటే నన్ను అనుసరించండి. ఆయన ఈ మాట అనగానే, అబూ లహబ్ ఆవేశంతో నవ్వు నాశనమై పోవుదువుగాక (నవూజుబిల్లా)! ఇంత చిన్న విషయం కోసమా నువ్వు మమ్మల్ని ఇక్కడకు పిలిచింది? అని అరిచాడు. ఇదేవిధంగా ఇతర ప్రజలు కూడా ఆయన్ని ఎగతాళి చేస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించారు. ఒక ప్రవక్త లేదా దైవసందేశ హరుడు అల్లాహ్ తరపున నియమించబడినప్పుడు ప్రజలకు ఆయన అనుచరులు ఎంతో సమర్థులు, సత్యవంతులు, ధైర్యవంతులు, అభివృద్ధి చెందుతున్నట్లుగా కనిపిస్తారు. కావున ఉనికిలో ఉన్న ఇతర జాతులు, వర్గాల హృదయాలలో వారి పట్ల ఒక రకమైన ద్వేషం, అసూయ ఖచ్చితంగా ఏర్పడుతుంది....దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో అప్పటి బహుదైవారాధకులు, యూదులు, క్రైస్తవ పండితులు సత్యాన్ని స్వీకరించే భాగ్యానికి దూరమయ్యారు. అంతేకాకుండా వారు తీవ్రమైన శత్రుత్వానికి సిద్ధమైనారు. అందువల్ల వారు ఏ విధంగానైనా ఇస్లాంను ఈ ప్రపంచం నుండి తుడిచి పెట్టాలని ఆలోచించడం ప్రారంభించారు. ఇస్లాం ప్రారంభ కాలంలో ముస్లింల సంఖ్య చాలా తక్కువ ఉండటం వల్ల వారి ప్రత్యర్థులు ముస్లింల పట్ల అనగా అనుచరుల పట్ల అత్యంత కఠినమైన శత్రుత్వాన్ని ప్రదర్శించారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఈ విధంగా ప్రవచించారు. శత్రుత్వం తీవ్రమై మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, ఆయన అనుచరులు మక్కా వాసులకు దైవ సందేశాన్ని అందజేయడం ప్రారంభించారు. ఈ లోక సృష్టికర్త అయిన అల్లాహ్ ఒక్కడే, అతడు తప్ప మరే ఆరాధ్యుడు లేడు. ప్రవక్తలందరూ ఏకేశ్వరోపాసననే అంగీకరించారు, తమ జాతులను ఆ బోధన వైపునకే పిలిచారు. మీరు కూడా ఏకైక దేవునుపై విశ్వాసం ఉంచండి. ఈ రాతి విగ్రహాలను వదిలివేయండి, ఇవి పూర్తిగా పనికిరానివని వారు బోధించారు. దేవుని ఏకత్వాన్ని వదిలివేయడం వల్ల మీ ఆలోచనలు అపవిత్రమయ్యాయి, మీ హృదయాలు చీకటిమయమయ్యాయి. మీకు ధర్మం మరియు అధర్మం మధ్య తేడా తెలియడం లేదు. మంచిని, చెడును గుర్తించలేకపోతున్నారు. మీ తల్లులను గౌరవించడం లేదు, మీ సోదరీమణులు, కుమార్తెలపై అన్యాయం చేస్తున్నారు, వారి హక్కులను వారికి ఇవ్వడం లేదు. మీ భార్యల పట్ల మీ ప్రవర్తన సరిగ్గా లేదు. అనాథల హక్కులను కాజేస్తున్నారు, వితంతువులతో చెడుగా ప్రవర్తిస్తున్నారు.

దైవ సామీప్యాన్ని పొందే మార్గం ఏమనగా ప్రతి హక్కుదారుడికి వారి హక్కును ఇవ్వండి. మహిళలను గౌరవించండి, వారి హక్కులను నెరవేర్చండి. అనాథలను అల్లాహ్ న్యాసంగా భావించండి, వారి సంరక్షణను గొప్ప పుణ్యకార్యంగా భావించండి. వితంతువులకు అండగా నిలవండి. కేవలం న్యాయం మాత్రమే కాకుండా దయ, పరోపకారాన్ని మీ లక్ష్యంగా చేసుకోండి. మక్కా ప్రజల ఆసక్తి ఇస్లాం వైపు పెరగడం చూసి ఒకరోజు మక్కా నాయకులందరూ కలిసి అబూ తాలిబ్ దగ్గరకు వచ్చారు. వారిలా అన్నారు. మీరు మా నాయకులు, మీ గౌరవం కోసమే మేము ముహమ్మద్‌ను ఏమీ అనడం లేదు. కానీ ఇప్పుడు మీతో ఒక ఆఖరి నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది. అయితే మీరు ఆయనకు నచ్చజెప్పండి, అసలు ఆయన మా నుండి ఏమి కోరుకుంటున్నారో అడగండి. ఆయనకు గౌరవం లేదా సంపద కావాలంటే మేము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము. ఒకవేళ ఆయనకు వివాహం చేసుకోవాలని ఉంటే మక్కాలోని ఆయనకు నచ్చిన ఏ అమ్మాయితోనైనా వివాహం జరిపించడానికి మేము సిద్ధం. మేము కోరుకునేది ఒక్కటే ఆయన మా విగ్రహాలను నిందించడం మానుకోవాలి. ఆయన మా ప్రతిపాదనను అంగీకరించకపోతే రెండు విషయాల్లో ఒకటి జరుగుతుంది. అయితే మీరు మీ సోదరుని కుమారుణ్ని వదిలిపెట్టాలి, లేదా ఈ జాతి మీ నాయకత్వాన్ని నిరాకరిస్తుంది.

అబూ తాలిబ్ దైవ ప్రవక్తను పిలిచి ఇలా అన్నారు. ఓ నా సోదరుని కుమారుడా! నా జాతి ప్రజలు నా దగ్గరకు వచ్చి ఈ సందేశాన్ని అందించారు. అప్పుడు మహా ప్రవక్త గారిలా సమాధానమిచ్చారు. ఓ నా ప్రియమైన చిన్నాన్న! మీరు మీ జాతిని వదిలిపెట్టి నాకు మద్దతు ఇవ్వాలని నేను కోరడం లేదు. కానీ సాటిలేని దేవుని సాక్ష్యంగా చెబుతున్నాను. ఒకవేళ వారు సూర్యుణ్ణి నా కుడి చేతిలో, చంద్రుణ్ణి నా ఎడమ చేతిలో తెచ్చి పెట్టినా సరే, నేను అల్లాహ్ తౌహీద్ గురించి బోధించడం మానను. అల్లాహ్ నాకు మరణం ప్రసాదించే వరకు నేను నా పనిని కొనసాగిస్తూనే ఉంటాను. నిష్కల్మషమైన ఈ సమాధానం అబూ తాలిబ్ కళ్లు తెరిపించడానికి సరిపోయింది. ఆయనిలా అన్నారు. ఓ నా సోదరుని కుమారుడా! వెళ్లు నీ కర్తవ్యాన్ని నీవు నెరవేర్చుకో. ఈ జాతి నన్ను వదిలిపెట్టాలనుకుంటే నిస్సందేహంగా వదిలిపెట్టనీ కానీ నేను మాత్రం నిన్ను వదిలిపెట్టను.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, ఆయన అనుచరులు తౌహీద్ స్థాపన కోసం మక్కాలోని అవిశ్వాసుల నుండి అన్ని రకాల అన్యాయాలను, హింసను భరించారు. మక్కా వాసుల వలె నేడు కూడా ఏ జాతులలోనైతే ఇటువంటి చెడులు ఉన్నాయో అవి తౌహీద్‌కు దూరంగా ఉండటం వల్లే సంభవిస్తున్నాయి. మన బాధ్యత ఏమనగా తౌహీద్‌ను నిరంతరం ప్రకటిస్తుండాలి. తౌహీద్ సందేశాన్ని అందిస్తున్నప్పుడు మన ఆధ్యాత్మిక, నైతిక స్థితిగతులలో కూడా ఒక స్పష్టమైన మార్పును తీసుకురావడానికి కృషి చేయవలెను. అల్లాహ్ తలా మనకు దీనిని నెరవేర్చే సామర్థ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్.

---

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْىِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -